2024 సంక్షేమంలో చీకటి వెలుగులు





'సంక్షేమ ప్రభుత్వం' అని తనకు తానే ఐదేళ్లు బాకా కొట్టుకుని ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం 2024 ప్రథమార్ధంలో జిల్లా ప్రజలకు చేసిన మేళ్లు ఏమిటి? ద్వితీయార్ధంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్నవేమిటి? ప్రజల ఆకాంక్షలకూ, ఆచరణకూ ఉన్న తేడాలను రెండు విభిన్న ప్రభుత్వాలను గద్దెమీద చూసిన 2024 సంవత్సరం పట్టి చూపుతోంది. ఆ కథాకమామిషు ఇలా ఉంది..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగనన్న జమానాలో..



అమ్మఒడికి ఎగనామం

అధికారంలోకి వచ్చాక వరుసగా నాలుగేళ్లు అమ్మఒడి అంటూ హడావుడి చేసిన వైసీపీ 2024లో మాత్రం అమ్మలకు ఎగనామం పెట్టింది. జిల్లాలో. లబ్దిదారులైన 1.70 లక్షల మంది తల్లులకు మొండి చేయి చూపింది. అర్హులైన తల్లులు ఏకంగా రూ. 250 కోట్లకు పైగా నష్టపోయారు.

వాహనమిత్రకు స్వస్తి



వాహనమిత్ర పథకం కింద ఆటోలు, ట్యాక్సీలు నడిపే యజమానులకు ఏటా ఇచ్చే రూ. 10 వేలు కూడా ఈ ఏడాది జగన్ ప్రభుత్వం ఎగ్గొట్టింది. 12 వేల మంది లబ్దిదారులకు 2024లో నిరాశే మిగిలింది. 40 వేల మంది అర్హత కలిగిన విద్యార్థులకు సుమారు రూ. 90 కోట్ల బకాయిలు పెండింగు పడ్డాయి. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా రెండు త్రైమాసికాల నిధులు పెండింగులో వున్నాయి.

విద్యార్థులకూ రూ. 90కోట్లు ఎగ్గొట్టారు



జగనన్న విద్యాదీవెన పేరిట విద్యార్థులకు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ పథకంలోనూ కోత పెట్టారు. 2024లో చివరి మూడు త్రైమాసికాలూ నగదు జమ చేయలేదు. 40 వేల మంది అర్హత కలిగిన విద్యార్థులకు రూ. 90 కోట్ల బకాయిలు పెండింగు పడ్డాయి. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా రెండు త్రైమాసికాల నిధులు పెండింగులోనే వున్నాయి.

చేయూత, ఆసరా అందాయి

జిల్లాలో 1,12,436 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేయూత పథకం నాలుగవ విడత కింద గత వైసీపీ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఏడాది మార్చి 7న రూ. 210.82 కోట్లు పంపిణీ చేసింది. అలాగే ఆసరా పథకం నాలుగవ విడత కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి 26,409 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,51,818 మంది సభ్యులకు ఈ ఏడాది జనవరి 23న రూ. 232.48 కోట్లు పంపిణీ చేసింది.



కూటమి పాలనలో..



పెన్షన్ల పెంపుతో కొత్త చరిత్ర

అవ్వాతాతలకు దేశంలోనే అత్యధిక మొత్తం పింఛను ఇస్తూ తాను మేలు చేశానంటూ జగన్ గొప్పలు చెప్పుకునేవాడు. నిజానికి ఆయన అధికారంలోకి వచ్చాక విడతల వారీగా ఐదేళ్లకు పెంచింది కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే. చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే ఒకేసారి వెయ్యి పెంచారు. మొత్తం 20 కేటగిరీలకు పెన్షన్ మొత్తాలు పెంచగా అందులో 11 కేటగిరీలకు రూ. వెయ్యి చొప్పున, మరో రెండు కేటగిరీలకు రూ. 3 వేలు చొప్పున, రెండు కేటగిరీలకు రూ. 10 వేలు వంతున, ఇంకో ఐదు కేటగిరీలకు రూ. 5 వేలు వంతున పెన్షన్ మొత్తాలను పెంచింది.

ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు



ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, మాజీ ఉద్యోగులు పెన్షన్ల కోసం రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పింది. ఇప్పుడు ఒకటో తేదీనే జిల్లాలోని 31,732 మంది ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయి. 17,501 మంది రిటైర్డు ఉద్యోగుల కుటుంబాలూ ధీమాగా పెన్షన్లు అందుకుంటున్నాయి.

- పల్లె పారిశుధ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ప్రస్తుత విడతలో 358 సీసీ డ్రెయిన్లను రూ.27.26 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన మధ్యాహ్నభోజనం ఇంటర్ విద్యార్థులకు మళ్లీ అందిచాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలోని 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 5759 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

ఉచిత సిలిండర్లతో హ్యాపీ



జిల్లాలో 4.92 లక్షల వంట గ్యాస్ వినియోగదారులుండగా అందులో 4.53 లక్షల మందికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందించే కార్యక్రమం మొదలైంది. 3.11 లక్షల మంది మొదటి ఉచిత సిలిండర్ బుక్ చేసుకున్నారు. వీరిలో 3.09 లక్షల మందికి సిలిండర్లు అందాయి. వారిలో 2.99 లక్షల మంది ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ అయింది. ఈ విధంగా ఈ ఏడాది రూ. 24.84 కోట్లు లబ్ధి వీరికి కలిగింది.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు



జగన్ అధికారంలోకి వచ్చీ రాగానే కక్షగట్టినట్టుగా పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు మూసేయించారు. కూటమి ప్రభుత్వం వీటిలో కొన్నింటిని ఈ ఏడాది అక్టోబరు నుంచీ తిరిగి తెరిపించింది. జిల్లాలో ఇప్పటికే పది క్యాంటీన్లు నడుస్తుండగా మరో రెండు త్వరలో ప్రారంభం కానున్నాయి. వీటి వల్ల భవన నిర్మాణ కూలీలు, పేద విద్యార్థులు, ఆస్పత్రులకు వస్తున్న రోగుల సహాయకుల ఆకలి తీరుతోంది.

అమలు కాని హామీలు

గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలలో కొన్ని ఈ ఏడాదిలో ఆచరణకు నోచుకోలేదు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 1500 ఆర్థిక సాయం, తల్లికి వందనం వంటివి ఇంకా అమలు కాలేదు. దీనివల్ల జిల్లాలో ఇంచుమించు 8 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకాల లబ్ధిని ఆరు నెలలుగా అందుకోలేదు.

పాడి రైతుకు బాసట

పేదరైతు కుటుంబాల ఉపాధిగా ఉన్న పాడి మీద కూడా జగన్ ప్రభుత్వం పగబట్టింది. కనీస ప్రోత్సాహకాలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాడియావులను సంరక్షించుకునేందుకు గోకులాల పేరిట షెడ్లు నిర్మించి ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 1358 గోకులాలను రూ. 29.94 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది.

ఇది మీ బాదుడే కదా జగన్..!

గత ఐదేళ్లలో తొమ్మిది సార్లు కరెంటు బిల్లుల షాక్

అదనపు ఛార్జీల వడ్డనతో జనానికి వైసీపీ చుక్కలు

విద్యుత్ ఛార్జీల పెంపు పై వైసీపీ నిరసన చేయడమా..?



.. ఇదీ జనం, కూటమి నేతల ప్రశ్న. అధికారంలో ఉన్న ఐదేళ్లు పెంచిన కరెంటు భారాన్ని గుర్తుచేస్తున్నారు. యూనిట్ రూ.5కు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8నుంచి రూ.14 వరకు కొనుగోలు చేసి ప్రజలపై జగన్ మోయలేని భారమేశారని మండిపడుతున్నారు. గత ఐదేళ్లు కరెంటు బిల్లులు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ఉన్నాయని వినియోగదారులను గగ్గోలు పెట్టించారు. తొమ్మిదిసార్లు ధరలు పెంచుకుంటూ పోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు కరెంట్ స్విచ్ వేయాలంటేనే భయపడిపోయే పరిస్థితికి తీసుకొచ్చారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల భారం నుంచి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు గత వైసీపీ పాలకులు చుక్కలు చూపించారు.

ఇదీ వైసీపీ బాదుడు : ఎస్పీడీసీఎల్ పరిధిలోని చిత్తూరు, కడప, నెల్లూరు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పెంచిన ట్రూ అప్ చార్జీలు మొత్తం రూ.6414 కోట్లు ఉండగా, వార్షిక ఆదాయ సర్దుబాటు చార్జీల రూపంలో రూ.878 కోట్లు వినియోగదారులపై భారం వేశారు.

సంవత్సరం	ట్రూఅప్ ఛార్జీలు	సర్దుబాటు ఛార్జీలు
2021-22	రూ.1392 కోట్లు	రూ.591.45 కోట్లు
2022-23	2398 కోట్లు	60.84 కోట్లు
2023-24	2624 కోట్లు	224.93 కోట్లు
మొత్తం	రూ.6414కోట్లు	రూ.876.93 కోట్లు

అందుకే ఎన్నికల ఫలితాలతో వినియోగదారులు తిరిగి వాళ్లకు షాక్ ఇచ్చారు. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్తుకు ట్రూ అప్ చార్జీ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసింది. సర్దుబాటు రుసుం, సర్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు.. ఇలా పేరు ఏదైనా వినియోగదారుల పైనే ఆ భారం పడింది. విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూఅప్ చార్జీల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను అడ్డగోలుగా బాదేసింది. ఎప్పుడో, ఎవరో వాడిన బిల్లులకు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తోందని వినియోగదారులు మండిపడ్డారు. ఇవికాకుండా బిల్లు వచ్చిన 14 రోజుల్లోపు చెల్లింపులు జరగకపోతే సర్‌ఛార్జ్, ఇంధన ఛార్జ్, జరిమానా రూపంలో పిండేశారు. ఒక విద్యుత్ సర్వీస్‌కు రూ.100 బిల్లు వస్తే, గడువు తీరిన వారంలోపు చెల్లించకపోతే రూ.135, వారంలోపు కూడా చెల్లించకపోతే మరో రూ.50.. ఆలస్య రుసుంతో రూ.185 చెల్లించాల్సి వచ్చింది. అంటే రూ.100 బిల్లుకు ఆలస్యం కారణంగా అదనంగా రూ85లు కట్టాల్సివచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నామమాత్రంగా వైసీపీ పోరుబాట



తిరుపతిలో వినతిపత్రం అందజేస్తున్న భూమన తదితరులు

విద్యుత్ బిల్లుల పెంపునకు నిరసనగా వైసీపీ నేతలు చేపట్టిన పోరుబాటలో పార్టీ శ్రేణులు ముఖం చాటేశారు. ఇటీవల కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన రైతుపోరుబాటలోనూ రైతుల జాడ కనిపించకుండా నవ్వులపాలయ్యారు. అదేవిధంగా శుక్రవారం జిల్లాలో పలు చోట్ల జరిగిన కరెంటు పోరుబాటలోనూ అదేపరిస్థితి కనిపించింది. ముఖ్యంగా తిరుపతి నియోజకవర్గంలో మున్సిపల్ కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, వైసీపీ హయాంలో పెద్దఎత్తున నామినేటెడ్ పదవులు పొందినవారు నిరసనలో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష వంటివారున్న చోట కూడా పార్టీ కేడర్ లేక పలు డివిజన్ల నుంచి తెప్పించుకున్న జనంతో నిరసన చేపట్టడం గమనార్హం. అదేవిధంగా శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం నామమాత్రంగానే సాగింది. ర్యాలీలో కూడా నిరసనకారులు పెద్దగా కనిపించలేదు. పుత్తూరులో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ జరిగింది. ఇక్కడా స్పందన అంతంతమాత్రమే. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేటలో చేపట్టిన నిరసన కార్యక్రమం రసాభాసగా మారింది. వినతిపత్రం ఇచ్చేందుకు విద్యుత్ కార్యాలయానికి చేరుకున్న వీరు ఒక్కసారిగా లోపలికి చొరబడే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో కిలివేటి వాగ్వాదానికి దిగారు. వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి నిరసన ర్యాలీలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా, అటుగా వెళ్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ నేత సీసీ నాయుడు అడ్డుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రెవెన్యూ సదస్సులకు 456 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 456 అర్జీలు అందాయి. ఇళ్ల స్థలాలు 63, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 14, కుల పరిశీలన 1, ఫాం 22ఏ 3, రీసర్వే 11, భూ ఆక్రమణ 1, ఆర్‌వోఆర్‌పై 254, ఇతర విషయాలకు సంబంధించి 91 అర్జీలు వచ్చాయి. అందులో 78అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను నిర్దిత కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారు. ఇప్పటి వరకు మొత్తం 12,762 అర్జీలు వచ్చాయి.

కులగణనపై సామాజిక తనిఖీ

- అభ్యంతరాల స్వీకరణ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల గణనపై సామాజిక తనిఖీ నిర్వహించి, ఈనెల 31వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శనగా ఉంచామని, అభ్యంతరాలు ఉంటే జనవరి 6వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. తుది జాబితాను 10వ తేదీ సంబంధిత సచివాలయాల్లో ప్రదర్శిస్తామని వెల్లడించారు.

లోన్ యాప్ ఈఎంఐ చెల్లింపులో ఆలస్యం

- బాధితురాలి ఫొటోల మార్ఫింగ్
- వాట్సప్ గ్రూపుల్లో పెడతామంటూ బెదిరింపు
- ఇద్దరు నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ ఈఎంఐలలో ఒక వాయిదా చెల్లించడంలో ఆలస్యమైందంటూ బాధితురాలి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆమెకు పంపారు. మిగతా వాట్సాప్ గ్రూపుల్లో పెడతామని బెదిరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను సూళ్లూరుపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను శుక్రవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటకు చెందిన ఒక మహిళ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తన అవసరాల నిమిత్తం ఆమె ఫినేబుల్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్, హైదరాబాదు బ్రాంచిలో కొంత మొత్తం రుణం తీసుకున్నారు. క్రమం తప్పకుండా ఐదు వాయిదాలు చెల్లించారామె. ఆరో వాయిదా చెల్లించకపోవడంతో ఆ కంపెనీకి చెందిన రికవరీ టీం సభ్యులు వాళ్లను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం చేశారు. ఆమె సోదరుడు, తల్లిని అసభ్యకరంగా దూషించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు బాధిత మహిళ ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేశారు. వీటిని వాట్సాప్‌లో బాధితురాలికి, ఆమె బంధువులకు పంపారు. లోన్ డబ్బులను వెంటనే చెల్లించకుంటే బాధితురాలి ఫొటోలను ఆమె కాంటాక్టుల్లో ఉన్న వారందరికీ పంపుతామని బెదిరించారు. దీనికి భయపడిన వారు లోన్ డబ్బులు చెల్లించేశారు.



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటగిరి డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐ మురళీకృష్ణ, సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఫినేబుల్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన మల్కాజ్‌గిరి జిల్లా నేరేడుమిట్ మండలం రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన లోన్ రికవరీ టీమ్ మేనేజర్ మర్క భరత్ యాదవ్, హైదరాబాదు ఫిల్మ్‌నగర్‌కు చెందిన పుటమశెట్టి రామకృష్ణను అరెస్టు చేశారు. వీరిని విచారించగా దీని వెనుక చాలా తతంగం ఉందని, కంపెనీ యాజమాన్యంపైనా చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, వెంకటగిరి డీఎస్పీ చెంచుబాబు, సీఐ, ఎస్‌లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

ఇలాంటి ఆన్‌లైన్ యాప్‌లు, సైబర్ క్రైం, లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా లేనంతవరకు ఇలానే జరుగుతాయన్నారు. ఎవరికైనా ఓటీపీ షేర్ చేయడం, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడం, మీకు పార్సిల్ వచ్చిందని చెప్పి బెదిరించడం జరుగుతుందని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

వరికి మద్దతు ధర ప్రకటన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంటకు సంబంధించి 89,615 హెక్టార్లలో 5,60,093 ధాన్యం ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో వరికి మద్ధతు ధర ప్రకటించినట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ, పౌరసరఫరా మార్కెటింగ్‌శాఖ అధికారలుతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ధాన్య సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించినట్లు చెప్పారు. మద్దతు ధర కన్నా తక్కువకు రైతులు విక్రయించుకునే పరిస్థితి కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మొదటి ఘాట్‌లో కొండకు వెలుగులు

తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి వెళ్లే భక్తులతో తిరుపతి నగరవాసులకు ఆహ్లాదకరంగా ఉండేలా మొదటి ఘాట్‌లోని వినాయకస్వామి ఆలయం వద్ద కొండకు నూతన లైట్లను అమర్చారు. గతంలో ఇదే ప్రాంతంలో లైట్లు ఉండేవి. రాత్రి వేళల్లో లైట్ల వెలుగుల్లో కొండలు సౌందర్యవంతంగా కనిపించేవి. అయితే వైల్డ్‌లైఫ్ అభ్యంతరాలతో పాటు వివిధ కారణాలతో ఆ లైట్లను తొలగించారు. ఈక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరిగి ఆ లైట్లను ఏర్పాటు చేయించి, భక్తులకు, స్థానికులకు కనువిందు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో టీటీడీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ట్రయల్‌రన్ కింద ఆరు ఫోకస్ లైట్లను అమర్చారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి దూసుకెళ్లిన కంటైనర్

- మహిళకు గాయాలు
- వరదయ్యపాళ్యంలో ఘటన

వరదయ్యపాళ్యం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళ్యం పోలీసు స్టేషన్ మలుపు వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి శుక్రవారం అర్ధరాత్రి కంటైనర్ దూసుకెళ్లింది. అంతకుముందే ఆలయం వెలుపల ముగ్గులు వేసి సామగ్రిని లోపల భద్రపరిచేందుకు గీత అనే మహిళ వెళ్లారు. ఇంతలో కంటైనర్ దూసుకు రావడంతో ఆమెకు గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపు డ్రైవర్ పరారయ్యాడు. గాయపడిన గీతను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



ఆలయంలోకి కంటైనరు దూసుకెళ్లడంతో గాయపడిన మహిళ

పొలాల దారి సమస్య పరిష్కారం



కంచె తొలగించాక ఏర్పడ్డ దారిని పరిశీలిస్తున్న మురళి

భాకరాపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చిన్న గొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీ మట్టివారిపల్లెలో పొలాల దారి సమస్యను పరిష్కరించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి తెలిపారు. మట్టివారిపల్లె రైతులు పొలాల వద్దకు వెళ్లే కాలువ వంక రహదారిని గత ప్రభుత్వ హయాంలో అదే గ్రామానికి చెందిన ఒక రైతు ఆక్రమించుకుని కంచె వేశారు. దీనిపై పలు మార్లు మట్టివారిపల్లె రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు దారిసమస్యను మురళి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రెవెన్యూ అధికారులతో సంప్రదించి సర్వే చేయించారు. అది ప్రభుత్వ భూమి అని తేలడంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఆక్రమణ భూమికి వేసిన కంచెను శుక్రవారం తొలగించారు. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లమ్మకు వెండి పళ్లెం బహూకరణ



వెండి పళ్లెంను అర్చకులకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో కొలువైన మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి వెండి పళ్లెంను కొత్త శానంబట్ల గ్రామానికి చెందిన కావునూరు పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులు కానుకగా సమర్పించారు. పళ్లెం విలువ రూ.1.20 లక్షలు ఉంటుంది. దాతలను ఆలయ అధికారులు, అర్చకులు సత్కరించి తీర్థప్రసాదములను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మమత, అర్చకులు సూరిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బయో వేస్ట్ బర్నింగ్ పరిశ్రమను తరలించాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మురగయ్య తదితరులు

రామచంద్రాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయల చెరువు పేటకు సమీపంలో రాజానగర్‌లోని బయోవేస్ట్ బర్నింగ్ పరిశ్రమను దూర ప్రాంతానికి తరలించాలని స్థానిక సర్పంచ్ మురగయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం రాయల చెరువుపేటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు వెంకట రమణకు గ్రామస్తులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్నింగ్ పరిశ్రమ నుంచి వెలువడే పొగతో దుర్వాసన వస్తోందన్నారు. స్పందించిన తహసీల్దారు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. 34 వినతులు అందాయని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు నాగభూషణం, లోకనాథం యాదవ్, మాధవయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచి పుస్తకపఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసాభివృద్ధిని సాధించవచ్చని సైకాలజిస్ట్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంఆర్‌పల్లెలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం కొత్తసంవత్సరం- సరికొత్త లక్ష్యాలు అనేఅంశంపై అవగాహనా సదస్సుని నిర్వహించారు. దీనిలో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన ఏడాది క్యాలెండర్‌ని బీవీబీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ రాజు, కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డిలతో ఆయన కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన ఏడాదిలో స్మార్ట్‌ఫోన్‌కి దూరంగా ఉండి పుస్తకపఠనానికి ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళిక రూపొందించుకుని ఆచరించాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాలకృష్ణనాయక్, సిబ్బంది

తిరుపతిరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఆవరణంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ తెలిపారు. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలోని విలేజ్‌క్లినిక్‌ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామస్తులకు అందిస్తున్న వైద్యసేవలని ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో కలసి గ్రామాన్ని సందర్శించారు. ఇంటిపరిసరాలు, ఖాళీపాత్రలు, టైర్లు, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరునిల్వలేకుండా చూడాలన్నారు. పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసరావు, దామినేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్, ఎంపీహెచ్ఈవో డాక్టర్ శ్రీనివాసులు, టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి మునిశేఖర్, నాయకులు చెంగల్రాయులు, హెల్త్‌సూపర్‌వైజర్ నరేష్, ఉమ, రేఖ, లలిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చార్జీలు తగ్గించేవరకు పోరాడుతాం



విద్యుత్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అధి కారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు హేమేంద్రకుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, ఎద్దల చంద్రశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి రఘునాథరెడ్డి, యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మఠం భూమిలో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమణకు అడ్డుగా ఉందని ట్రాన్స్‌ఫార్మర్ వేరొకచోట ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు





రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మఠం భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

చంద్రగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మిట్టపాళెం గ్రామంలో హథీరామ్‌జీ మఠం భూమిని ఉద్యోగ సంఘం నాయకుడిగా పనిచేసిన ఓ వ్యక్తి వైసీపీ అండతో ఆక్రమించాడు. నిర్మాణాలు చేపట్టాడు. అంతేగాక తన అధికార బలంతో ఆక్రమణకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏకంగా రోడ్డు పక్కకు మార్చేశాడు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఓ పశువు విద్యుత్ షాకుకు గురై మృతిచెందింది. అంతేకాకుండా ఆదారిలో నిత్యం ప్రతి రోజూ వందలాది మంది శ్రీవారి భక్తులు, వాహనాల్లో, కాలినడకన శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు వెళుతుంటారు. స్థానికులు శ్రీనివాసమంగా పురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఆదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వారిపాలిట ప్రమాదకరంగా ఉంది. మఠం అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని, రోడ్డుకు అనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



తిరుపతిరూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో ఎన్టీఆర్‌కాలనీ వద్దనున్న శ్మశాన వాటిక స్థలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణానికి పార్టీలకు అతీతంగా గ్రామస్తులు కలసి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఇటీవల మండల సర్వేయర్ నేతృత్వంలో శ్మశానస్థలాన్ని సర్వే చేసి 1.43 ఎకరాలు మిగిలి ఉన్నట్లు నిర్ధారించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో ఈ స్థలానికి హద్దుగా ప్రహరీ నిర్మాణం, ఆర్చ్, గేటు, కర్మక్రియల షెడ్డు, నీటిసదుపాయం కల్పించే ఏర్పాట్లు చేపడుతామని గ్రామస్తులు అంటున్నారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మధు, మధుశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతలరోడ్డులో స్టోన్‌డస్ట్‌తో చదును



తిరుపతిరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని తెలుగుతల్లి ఆశ్రమం, రామదాస్‌కాలనీలకు వెళ్లే మట్టిరోడ్డు మార్గంలోని గుంతల్లో స్టోన్‌డస్ట్ తోలి చదును చేస్తున్నారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయరహదారి నుంచి వేదాంతపురం మీదుగా వెళ్లే ఈరోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరుచేరి, రొచ్చురొచ్చుగా తయారైంది. దీనిపై ఈనెల23న ఆంధ్రజ్యోతిలో 'పట్టించుకోండిసారూ' అనేశీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ నిధులతో స్టోన్‌డస్ట్‌ను తోలి గుంతలను చదును చేసే పనులను చేపట్టారు.

హెల్మెట్ ధరించండి



చంద్రగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అని పోలీసులు కోరారు. శుక్రవారం సీఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అందరూ హెల్మెట్ ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కృషి ఉంటే విజయం తథ్యం

తిరుపతి(విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషి ఉంటే ఏ పనిలోనైనా విజయం తథ్యమని కొమండూర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, న్యాయవాది కేవీఎస్ వాసు చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై స్ప్రింగ్‌డేల్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. ప్రిన్సిపాల్ కె.ఆర్.అనురాధ గోపాల్, హెచ్ఎం ప్రమీల కృష్ణన్, ఏవో చంద్రశేఖర్, పీఆర్వో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

నలందనగర్‌లో చోరీ

- 80 గ్రాముల బంగారు, ఐదు కిలోల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ నలందనగర్‌లో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. బంగారు నగలు, వెండి సామగ్రి అపహరణకు గురయ్యాయి. రూరల్ ఎస్ఐ షేక్‌షావలి వివరాల మేరకు.. నలందనగర్‌కు చెందిన సురేష్ కుమార్ రెడ్డి కుమారుడికి ఇటీవల వివాహమైంది. కుటుంబ సభ్యులందరూ కలిసి నాలుగు రోజుల క్రితం విహారయాత్రకు గాను హైదరాబాదుకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి కిటికీలు పగులకొట్టి లోనికి ప్రవేశించారు. 80 గ్రాముల బంగారు నగలు, ఐదు కిలోల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. మరుసటి రోజు ఉదయం ఎదురింటి వారు గమనించి సురేష్‌కుమార్‌రెడ్డికి విషయం తెలియచేశారు. శుక్రవారం తిరుపతికి చేరుకున్న ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌షావలి ఘటనా స్థలాన్ని పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేశారు.

జీవితమే నాటకం..!

- పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాల ప్రారంభ సభలో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుట్టుటయు నిజము.. గిట్టుటయు నిజము.. నట్టనడిమి పని నాటకమని తాళ్లపాక అన్నమాచార్యులు చెప్పినట్టుగా మనిషి జీవితమే నాటకమని వక్తలు పేర్కొన్నారు. కోనేటి సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళా క్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తాజ్ ఇంటర్నేషనల్ హోటల్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి, కోనేటి సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. అనంతరం నటుడు పొగర్తి నాగేశ్వరరావుకు నటభూషణ, నాటక దర్శకుడు గంటా ముత్యాలరావు నాయుడుకు నటసార్వభౌమ పురస్కారాలను ప్రదానం చేశారు.

ఆలోపించజేస్తున్న నాటక ప్రదర్శనలు

అనకాపల్లెకు చెందిన షిరిడీసాయి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆశ కదరా శివ నాటకం అందరినీ ఆకట్టుకుంది. విశాఖపట్నంకు చెందిన నటరాజ నాటక సంస్థ ఆధ్వర్యంలో పుత్రదేవోభవ, ఒంగోలుకు చెందిన ఎన్టీఆర్ సాంస్కృతిక సంస్థ హెచ్చరిక నాటకాన్ని ప్రదర్శించాయి. తొలి రోజు నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



ఆశ కదరా శివా నాటకంలోని దృశ్యం

వాననీరు ఏటిపాలు

- పూడిపోయిన దామలచెరువు - పాకాల సప్లయ్ చానల్
- నిండని చెరువులు





ఊట్లవారిపల్లె సమీపంలో దామలచెరువు - పాకాల సప్లయ్ చానల్ పూడుకుపోవడంతో నిండని తడకర చెరువు

పాకాల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దామలచెరువు - పాకాల సప్లయ్ చానల్ మరమ్మతులు, పూడిక తీతలు సకాలంలో చేపట్టక పోవడంతో వర్షపునీరు చెరువులకు చేరలేదు. ఫలితంగా చాలా చెరువులు నీరులేక వెలవెలబోతున్నాయి. పదిపుట్లబైలు రిజర్వాయర్ నిండి మొరవ నీళ్లు దామలచెరువు పెద్దవంకకు చేరుతున్నాయి. అలాగే వరదప్ప నాయుడుపేట, ఈపాలగుట్టపల్లె, వల్లివేడు పరిసర ప్రాంతాలలో కురిసిన వర్షాలకు నీళ్లు దామలచెరువు పెద్దవంకకు చేరుతున్నాయి. దామల చెరువు పెద్దవంక నుంచి పాకాల వరకు చెరువులు నింపడానికి సప్లయ్ ఛానల్ ఉంది. ఈ పెద్దవంక నుంచి చానల్ ద్వారా పాకాల వరకు వున్న చెరువులు నిండుతాయి. మల్లప్పగారిపల్లె వరకు చానల్‌లో నీళ్లు పారి ఆ చెరువు నిండింది. అక్కడ నుంచి పాకాల వరకు నిర్వహణ లేక కాలువలో పిచ్చిమొక్కలు మొలిచాయి అక్కడక్కడ పూడిపోయింది. నీళ్లు పారే పరిస్థితి లేకపోవడంతో నీళ్లు రావడంలేదు. దీంతో గుమ్మడివారి ఇండ్లు సమీపంలోని మల్లెలచెరువు, ఊట్లవారిపల్లె సమీపంలోని తడకర చెరువు, రామసముద్రం చెరువులు నీళ్లు లేక బోసిపోతున్నాయి. ఈ చెరువుల కింద వున్న సుమారు 100 ఎకరాలకు పైగా ఆయకట్టు బీడుగా వుంది. ఈ చెరువులు నిండితే పరిసరప్రాంతాలలో బావులు, బోర్లలో నీళ్లు పుష్కలంగా వుంటాయి. తాగు, సాగునీటికి ఇబ్బందులు వుండవు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండి మొరవపోతున్నా ఈ చెరువుల్లో గుంతలు మాత్రమే నిండాయి. దామలచెరువు పెద్దవంక నీళ్లు ఎన్టీఆర్ జలాశయానికి చేరి అక్కడ నుంచి వృథాగా కిందివైపు వెళ్లిపోతున్నాయి. మద్దినాయనిపల్లె, గానుగపెంట ప్రాంతాలలోని చెరువులు నిండి పాకాల పెద్దవంక ద్వారా పాకాల పెద్దచెరువుకు చేరి మొరవపోయి ఏటిపాలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సప్లయ్ చానల్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని, పూడికి తీయించాలని పరిసరగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ ఉద్యోగుల సిఫార్సు లేఖల గదుల కౌంటర్ మార్పు



నూతన గదుల కేటాయింపు కౌంటర్

తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): టీటీడీ అధికారులు, ఉద్యోగుల సిఫార్సులపై గదులు కేటాయించే కౌంటర్‌ను ఎంబీసీ విచారణ కార్యాలయం వద్దకు మార్చారు. గతంలో ఎంబీసీ34 లోనే టీటీడీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, శ్రీవాణి, రిసెప్షన్ అధికారుల సంతకాలపై గదులు కేటాయించేవారు. అయితే ఎంబీసీ34 కౌంటర్ల వద్ద నిత్యం భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. దీంతో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోంది. ఈక్రమంలో నిరీక్షణ సమయాన్ని తగ్గించడంలో భాగంగా టీటీడీ ఉద్యోగుల సిఫార్సు లేఖలపై గదులు ఇచ్చే కౌంటర్‌ను ఎంబీసీ విచారణ కార్యాలయం, లగేజీ కౌంటర్ల వద్దకు మార్చారు. దీంతో ఉద్యోగుల సిఫార్సులపై వచ్చిన వారు సులభతరంగా గదులు పొందుతున్నారు. గదుల కోసం నిత్యం వంద నుంచి 150 వరకు టీటీడీ ఉద్యోగుల సిఫార్సు లేఖలు వస్తున్నాయి.

ఇంటిపట్టాలు మంజూరు చేయండి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్

తిరుపతిరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా స్థిరనివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నామని తమకు ఇంటిపట్టాలు లేదా ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు మంజూరు చేసి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. తిరుపతిరూరల్ మండలం వేదాంతపురంగ్రామపంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రామాంజులునాయక్ అర్జీలను స్వీకరించారు. మార్క్సనగర్‌లో 20ఏళ్లుగా నివశిస్తున్న తమకు నీటికుళాయి, విద్యుత్, మట్టిరోడ్డు సౌకర్యాలు కల్పించారని, ఇంటిపట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. గత వైసీపీ పాలనలో పంచాయతీపరిధిలో నివసించే దాదాపు 300మందికి ఏర్పేడు మండలంలోని చిందేపల్లె వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇంటి పట్టాలు మంజూరుచేశారని అయితే స్థలాలు చూపలేదని వాపోయారు. పంచాయతీ పరిధిలోని బాయమ్మతోటవద్ద గతంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ఖాళీలను గుర్తించి తమకు ఇంటిస్థలాలు కేటాయించాలని కోరారు. ఇన్‌చార్జి సర్పంచ్ చెరుకుల జనార్థన్‌యాదవ్, టీడీపీ నేతలు తోట చిరంజీవిరెడ్డి, లక్ష్మీప్రసాద్, చెరుకుల పరంధామ్‌యాదవ్, చంద్రముదిరాజ్, రవి, ఆర్ఐ రఘువర్మ, సర్వేయర్ హేమకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో కాలువ పొరంబోకు స్థలం

తిరుపతిరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీపరిధిలో తెలుగుతల్లి వృద్ధాశ్రమానికి సమీపంలోని సర్వేనంబరు 224 లోని ప్రభుత్వ కాలువ పొరంబోకు స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టారు. రోడ్డుకి అనుకుని ఉన్న ఈ స్థలం ఎంతో ఖరీదైనది కావడంతో గుట్టుచప్పుడుకాకుండా చిన్నచిన్న రేకుల షెడ్లు నిర్మించి ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ ఆక్రమణలకు వెనుకవైపు గతంలో ప్రభుత్వం పలువురికి ఇంటి పట్టాలని మంజూరు చేసింది. వారు ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే తమ ఇళ్లకు వెళ్లేందుకు దారిలేకుండా ఆక్రమణదారులు నిర్మాణాలను చేపట్టారని శుక్రవారం నిర్వహించిన రెవెన్యూసదస్సులో తహసీల్దార్ రామాంజులునాయక్‌కి ప్రజలు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ, సర్వేయర్లు కాలువ పొరంబోకు స్థలాన్ని పరిశీలించారు. అది కాలువపొరంబోకు స్థలమని గుర్తించారు. దీనిపై తహసీల్దార్‌కి నివేదించి ఆక్రమణలపై చర్యలు చేపడుతామని వివరించారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

తిరుపతి(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దనలక్ష్మీనగర్‌లోని భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల నుంచి భాష్యం లిటిల్ చాంప్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. గెలుపొందిన విద్యార్థులకు భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జోనల్ సీవో బిందుమాధవి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

రవాణా రంగం ప్రైవేటీకరణ ఆపాలి



ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు

తిరుపతి(రవాణా), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగం ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలసుబ్రహ్మణ్యం, తంజావూరు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య అధ్యక్షతన జిల్లా రవాణా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రవాణా రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెపితే డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుంద న్నారు. అనుభవం లేని వారికి డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడం ద్వారా ప్రమాదాలు పెరిగే అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా నాయకులు మునిరాజా, బుజ్జి, ఆటో యూనియన్ నగర కార్యదర్శి వాసు, యూనియన్ నాయకులు ప్రసాద్, రాము, సుధాకర్, సాయి, రమేష్, మహబూబ్‌బాషా, చక్రపాణి, హరి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

- గిరిజన సాంస్కృతికోత్సవంలో ఎస్వీయూ వీసీ అప్పారావు



సాంస్కృతికోత్సవాలను ప్రారంభిస్తున్న వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు ఆకాంక్షించారు. బంజారా జనసంఘ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో గిరిజన సాంస్కృతికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ విద్య ద్వారానే గిరిజనులు చైతన్యం కావడానికి అవకాశం ఉందన్నారు. ఎంపీ అజ్మీర్ సీతారాంనాయక్ మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలను గిరిజనులు కాపాడుతున్నారని తెలిపారు. అనంతరం నిర్వహించిన గిరిజన సంప్రదాయ కళా రూపాలు ఆకట్టుకున్నాయి. బంజారా జనసంఘ్ అధ్యక్షుడు హరిచౌహాన్, న్యాయవాది మాసూమయ్య, వినోద్‌రాథోడ్, హేమంత్‌నాయక్, చంద్రశేఖర్‌నాయక్, నాగేంద్రనాయక్, కిషోర్ నాయక్, ప్రియాంకనాయక్ పాల్గొన్నారు.

పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా..!



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న లీలాచౌదరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా.. అంటూ పావులూరు లీలా చౌదరి ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో గోవిందరాజస్వామి కోనేటి కట్టపై శుక్రవారం సాయంత్రం గాత్ర సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ మ్యూజిక్ కాలేజీ విద్యార్థి లీలాచౌదరి పలు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. బ్రహ్మకడిగిన పాదము, అన్ని మంత్రములు ఇందే ఆలపించెను, చక్కని తల్లికి ఛాంగుభళా, కలగంటి కలగంటి, మూసిన ముత్యాలకేలే మొరగులు, బ్రహ్మమొక్కటే, పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా అంటూ ఆలపించిన సంకీర్తనలు వీనుల విందుగా పాడారు. గురువు వెంకటేశ్వర్లు ఆమెను అభినందించారు. కీబోర్డుపై రమణకుమార్, తబలాపై కోదండరాం వాద్య సహకారం అందించారు. రిటైర్డు జడ్జి సుబ్బలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ శ్రీనివాసరెడ్డి, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల మేళా ప్రారంభం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాస్ ప్రధాన కార్యాలయంలో చిరుధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల మేళా శుక్రవారం ప్రారంభమైంది. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

ఏపీ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్

తిరుపతి(వైద్యం): ఏపీ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శిగా దేవల రమణ, కమిటీ సభ్యుడిగా నాగరాజు నియమితులయ్యారు. మదన్‌మోహన్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడుతూ బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ర్యాలీగా వెళుతున్న వైసీపీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూమన అభినయ్ ఆధ్వర్యంలో పద్మావతీపురం నుంచి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, సీజీఎం రమణాదేవిలకు వినతిపత్రం ఇచ్చారు. మేయర్ శిరీష, కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ...





జూపార్కు రోడ్డు ఇలా..

అలిపిరి నుంచి జూపార్కు వెళ్లే రోడ్డు ఇరువైపులా చెత్త పేరుకుపోయింది. రోడ్డు పక్కన అదనపు స్థలం ఉండడంతో నిర్మాణాల వ్యర్థాలను రాత్రిపూట తీసుకొచ్చి ఇక్కడే పడేస్తున్నారు. ఇదే మార్గంలో సంచార టిఫిన్ సెంటర్లు నడస్తుండడంతో వాటి ద్వారా పోగయ్యే చెత్తను దారిపొడవున కుప్పలు కుప్పలుగా పోస్తున్నారు. గరుడ వలయానికి కూతవేటు దూరంలో ఆహారపదార్థాలు, ప్లాస్టిక్స్ కవర్లు, పేపర్ ప్లేట్లు, పాడైన పరుపులు, దివానాలు, బట్టలు పడేశారు. పగులగొట్టిన కొబ్బరికాయలు టన్నుల కొద్దీ నిల్వ ఉన్నాయి. చెత్త వర్షానికి కుళ్లి దుర్వాసన వస్తుండడంతో శ్రీవారి భక్తులు, ప్రయాణికులు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

- తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

అపరిశుభ్రంగా కాలువలు



తిరుపతి(జీవకోన), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్కావెంజర్స్‌కాలనీ ఎదురుగా ఉన్న మధురానగర్ దోబీఘాట్‌కు వెళ్లేదారిలో కాలువలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని, అధికారులు స్పందించి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాన్సర్ నివారణోపాయాలను కనుక్కోండి



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు నివారణోపాయాలను కనుక్కోవాలని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు కోరారు. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్ థెరపిటిక్స్ అంశంపై చేపట్టిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును సెనేట్ హాల్లో ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌కు చికిత్స ఔషధాల వినియోగం కోసం బయోటెక్నాలజీ ద్వారా శాస్త్రీయ పరిష్కారాలను సూచించాలని కోరారు. అలబామ వర్సిటీ ప్రొఫెసర్ మల్ల మిధున్ మాట్లాడుతూ పేగు క్యాన్సర్ నివారణలో ఇప్పటికే ఎంతో పురోగతి సాధించినట్లు చెప్పారు. పలు ప్రాంతాల ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సదస్సు కన్వీనర్ సరిత పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ అంజయ్య తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో కుల మతాలకతీతంగా ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ నేతలు మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టడమేగాక దాడులకు తెగబడుతుండటం దుర్మార్గమైన చర్యన్నారు. బీజేపీ కూడా రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి వాటిని అడ్డుకోకపోతే దేశంలో శాంతిభద్రతలు కరువవుతాయన్నారు. దీనికి సంబంధించి నిర్వహిస్తున్న సదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కత్తిరించిన మొక్కలను తొలగించారు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డు డివైడర్‌లో కత్తిరించి పడేసిన మొక్కలను శుక్రవారం తొలగించారు. కత్తిరించిన మొక్కలను అలాగే రోడ్డుపై పడేయడంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'కత్తిరించి వదిలేశారు' అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వాటిని తొలగించి, రోడ్డంతా శుభ్రం చేశారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

టీఎన్‌పాలెం శ్మశాన సమస్యపై జేసీ విచారణ



శ్మశానం కోసం ఫారెస్ట్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామమోహన్

తిరుపతి (జీవకోన), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిమ్మినాయుడుపాలెం హరిజనవాడ శ్మశాన సమస్యపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ విచారణ చేపట్టారు. ఆర్డీవో రామమోహన్, డీఎఫ్‌వో వివేక్, తహసీల్దార్ భాగ్యలక్ష్మిలతో కలిసి హరిజనవాడ వెనుకవైపు ఉన్న ఫారెస్ట్ స్థలాన్ని పరిశీలించారు. శ్మశాన స్థలం కోసం కొన్నేళ్లుగా చేసుకుంటున్న విన్నపాల నేపథ్యంలో అటవీ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్తులను విచారించారు. గ్రామ సమీపంలోని అటవీ స్థలాన్ని పరిశీలించిన అనంతరం డీఎఫ్‌వోతో చర్చించారు. తక్షణమే నివేదిక పంపాలని ఆర్డీవో, తహసీల్దార్లను జేసీ ఆదేశించారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపిక



రమ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జనవరి 26వ తేదీ నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు పద్మావతి మహిళా యూనివర్సిటీ బీపీఈడీ విద్యార్థిని రమ్య ఎంపికయ్యారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శారాసరోజిని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ విద్యావతి అభినందించారు.

మెగా జాబ్‌మేళా నిర్వహించండి

సిడాప్ చైర్మన్‌కు శాప్ చైర్మన్ విన్నపం



దీపక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనలో భాగంగా తిరుపతిలో మెగా జాబ్‌మేళా నిర్వహించాలని సిడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డిని శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని సిడాప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. రవినాయుడు మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు పరిధిలో 2 లక్షల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్నారని గుర్తు చేశారు. తిరుపతికి మల్టీనేషనల్ కంపెనీలు, ఇండస్ట్రీలను తీసుకొచ్చి మెగా జాబ్‌మేళా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి శిక్షణ నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సిడాప్ చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

30న బీఫార్మసీ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ బీఫార్మసీ కోర్సులో స్పాన్సర్ సీట్ల భర్తీకి ఈనెల 30 వ తేదీ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల కార్యాలయంలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆసక్తి కల్గిన వారు సమగ్ర సమాచారం కోసం అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు కోరారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రెఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ రిపేరు, బ్యూటీషియన్ (పురుషులు, మహిళలు) కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు జీవనోపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోపు తిరుపతి మున్సిపల్ మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8639647655, 8639649420లను సంప్రదించాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు రేషన్, ఆధార్‌కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్ జతపరచాల్సి ఉంటుందని తెలిపారు.

మన్మోహన్‌కు కాంగ్రెస్ నేతల నివాళి



మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి (వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు గోపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, శివశంకర్, మల్లికార్జున్, జ్యోతీశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే ఆర్థికవేత్త మన్మోహన్



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మల్లికార్జున

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశం గర్వించే ఆర్థికవేత్త అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున పేర్కొన్నారు. ఎస్వీయూలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శుక్రవారం ఆయన పుష్పాంజలి ఘటించారు. మల్లికార్జున మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టి ప్రగతి మార్గంలో నిలిపిన ఘనత మన్మోహన్‌కు దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శివబాలాజీ, షేక్ మన్సూర్, శ్రీధర్ పాల్గొన్నారు. ● ఎస్వీ యూనివర్సిటీ ఎకనమిక్స్ విభాగంలో మన్మోహన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు.

ఆ వీఆర్వో మా కొద్దు!

తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్తేరిమిట్టవాసుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత రైతులు

వరదయ్యపాళెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రికార్డులు తారుమారు చేస్తున్న వీఆర్వో తమకు వద్దంటూ మత్తేరిమిట్ట దళిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని చిలమత్తూరు పంచాయతీ మత్తేరిమిట్టలోని సర్వే నెం.35లో సుమారు 60ఎకరాల భూమిని 1960 నుంచి తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. రైతు శ్రీనివాసమూర్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత భూమిని విక్రయించారన్నారు. ఈక్రమంలో శ్రీనివాసమూర్తి కుటుంబీకుల్లో ఒకరైన ప్రియ చిలమత్తూరు పంచాయతీ సమీపంలో పరిశ్రమలు నెలకొల్పిందన్నారు. ఆమెకు ఎవరో ఆశ చూపి దళిత నిరుపేదలైన తమ పేరుపై ఉన్న భూములను వీఆర్వో రమణయ్య తారుమారు చేశాడని ఆరోపించారు. 2020-24 మధ్య ఇక్కడ పనిచేశారని, సాధారణ బదిలీల్లో వేరే పంచాయతీకి మార్చారన్నారు. కానీ మళ్లీ ఇదే మండలానికి బదిలీ చేయించుకున్నాడన్నారు. అనంతరం తమ సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దారు రాజశేఖర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ... భూముల పత్రాలను అందిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌నాయుడు, భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాయుడునాయుడు, మహేంద్ర, నందకిషోర్, ప్రభాకర్, మనోహర, శేఖర్‌నాయుడు, రామకృష్ణ, స్వామిదాస్, వెంకటేష్, రాజగోపాల్‌నాయుడు, విశ్వనాథ్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొనానరు.

దర్శనానికి 18 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,564

తలనీలాలు సమర్పించినవారు: 24,905

కళతప్పిన నాదనీరాజనం







తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీనివాసుడు నాదప్రియుడు. ఆలయం ముందు నాట్య, గానాలతో కళాకారులు తిరుమలేశుని నివేదించుకునే అరుదైన కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. దానికి 'నాదనీరాజనం' అనే పేరు పెట్టారు. భారతరత్నలు, పద్మభూషణులు, పద్మశ్రీలు ఎందరో ఈ వేదికమీద నుంచి కళార్చన చేశారు. టీటీడీ కూడా ఈ కళాకారులను సముచితంగా సత్కరించి స్వామి దర్శనం చేయించి గౌరవించుకునేది. జగన్ జమానాలో కళపై కత్తికట్టారు. 'నాదనీరాజనం' కార్యాక్రమాన్ని భ్రష్టుపట్టించారు. కళాకారులకు కనీసం దర్శనాలు కూడా లేకుండా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అయినా 'నాదనీరాజనం' లోపాలను సరిదిద్ది పూర్వ వైభవం తీసుకురావాలని కళాభిమానులు కోరుకుంటున్నారు.

- జగన్ జమానాలో నీరుగార్చేశారు
- కళాకారులకు కరువైన గౌరవం
- ముఖం చాటేస్తున్న ప్రసిద్ధులు
- కళాకారుల ఎంపిక తీరుపై ఆరోపణలు
- పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని కొత్త పాలకమండలికి కళాభిమానుల వేడుకోలు

కళావిలువలకు తిలోదకాలు

'నాదనీరాజనం' ప్రదర్శనలకు గతంలో ఒక ఎంపిక కమిటీ ఉండేది. టీటీడీ మాజీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ నేతృత్వంలో.. కుమారి కన్యాకుమారి, శోభారాజ్, మల్లాది సూరిబాబు, గంగాదేవి, నేదునూరి కృష్ణమూర్తి వంటి దాదాపు 35 మంది సంగీత ప్రముఖులు ఈ కమిటీలో ఉండేవారు. వీరు కళాప్రదర్శనలు ఎంపిక చేసి ఏ రోజున ప్రదర్శన ఇవ్వాలో నిర్ణయించేవారు. 2017లో పీవీఆర్కే ప్రసాద్ మరణం తర్వాత నిపుణుల కమిటీ లేకుండా పోయింది. అయితే 2022 ఫిబ్రవరిలో సంగీత కళాశాల, వేదిక్ యూనివర్సిటీ, ఎస్వీబీసీ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కళాకారుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేడ్‌తో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం కళాప్రదర్శనలకు అనుమతులు ఇచ్చేశారు. కళాకారుల పట్ల టీటీడీ తీరుపై అసంతృప్తి చెందిన ప్రసిద్ధులైన కళాకారులు 'నాదనీరాజనం'పై ఆసక్తి చూపలేదు. దీంతో కళాకారులకు పారితోషకాన్ని రద్దు చేసి, ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు మాత్రమే దర్శనం, వసతిని కల్పించారు. ఉచితంగా ప్రదర్శనలిచ్చేందుకు ఔత్సాహికులైన కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చునంటూ అప్పట్లో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రకటనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చైర్మన్‌గారూ పట్టించుకోండి

శ్రీకృష్ణదేవరాయలు వంటి కళాపోషకులకు ఆరాధ్య దైవం అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న కళారహిత చర్యలను సరిదిద్దాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కళాభిమానులు డా. టి.శ్రీనివాసరావు, డా. కె.జగ్గారావు టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడును అభ్యర్థిస్తూ ఒక లేఖ రాశారు. ఒకప్పటి పారితోషకాల విధానాన్నీ, గౌరవాలను తిరిగి ప్రవేశపెట్టి నాదనీరాజనంకు పూర్వపు వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు.

గతమెంతో ఘనం

2009 ఆగష్టు 15న తిరుమల ఆలయం ఎదురుగా ఉండే వేదికపై 'నాదనీరాజనం' ప్రదర్శనలు మొదలయ్యాయి. ఈ వేదికను ఒక దాత నిర్మించారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు 'నాదనీరాజనం'లో జరిగేవి. శాస్త్రీయ నృత్య, సంగీతాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. భారతరత్న లత మంగేష్కర్ (గాత్రం), పద్మవిభూషణ్ లు హరిప్రసాద్ చౌరస్యా (వేణువు), పండిట్ శివకుమార్ (సితార్), మంగళంపల్లి బాలమురళికష్ణ (గాత్రం), శివరామన్ (మదంగం), పద్మశ్రీలు రంజన గోహర్ (ఒడిస్సీ), శోభానాయుడు (భరతనాట్యం), మీనాక్షి (కూచిపూడి), విఠల్‌దాస్ (నామసంకీర్తనం), కుమారి కన్యకుమారి (వయోలిన్), ఎల్లా వెంకటేశ్వర్లు (మృదంగం) వంటి ఎందరో ప్రసిద్ధులు ఈ వేదికపై ప్రదర్శనలు ఇచ్చారు. నిజానికి 'నాదనీరాజనం' వేదికపై ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు దేశ,విదేశాల్లో ఉన్న డిమాండు సామాన్యమైనది కాదు. లక్షలకు లక్షలు చెల్లించినా కార్యక్రమానికి వారు అంగీకరించడం అంత సులువు కాదు. సాక్షాత్తూ తిరుమల స్వామి సమక్షంలో తాము పాడుతున్నామనీ, నృత్యం చేస్తున్నామనే భావనే వీరిని తిరుమలకు రప్పించేది.

ఇలా ఉండేది..

సుదూర ప్రాంతాల నుంచి ప్రదర్శన ఇచ్చేందుకు తిరుమలకు వచ్చే కళాకారులకు గతంలో ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవారు. ఏ టాప్‌కు రూ.35 వేలు, ఏ గ్రేడ్‌కు రూ.30 వేలు, నత్యంకు రూ.60 వేలు, నామసంకీర్తనంకు రూ.20 వేలు అందజేసేవారు. అలాగే కళాకారులందరికీ ఉచిత రవాణా, బస కల్పించేవారు. ప్రత్యేక దర్శనం ఉండేది. ప్రదర్శన అనంతరం వేదిక మీదే వీరిని సత్కరించి లడ్డూ ప్రసాదాలు అందజేసేవారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఈవో, జేఈవోలు సైతం హాజరయ్యేవారు. కళాకారులు కూడా ఎంతో సంతృప్తి చెందేవారు.

ఇలా దిగజారింది..

జగన్ జమానాలో కళాప్రదర్శనలకు విలువ లేకుండా పోయింది. కళాకారులను గౌరవించడం తగ్గిపోయింది. టీటీడీకి ఆర్థికభారం అంటూ అన్నీ రద్దు చేసేశారు. 'నాదనీరాజనం'లో ప్రదర్శన ఇవ్వాలనుకున్నవారు సొంత ఖర్చుతోనే తిరుమలకు రావాలని ఆదేశించారు. కళాకారులకు ఉచిత వసతి లేదన్నారు. చివరికి స్వామి దర్శనాలు కూడా కుదరదని చెప్పేశారు. కార్యక్రమం సమయాన్ని కూడా మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. 2020 నుంచి ఏడాది పాటు ఈ విధానం కొనసాగింది. దీంతో చాలా మంది ప్రముఖ కళాకారులు రావడానికి ఇష్టపడలేదు. ఒకప్పుడు కర్ణాటక, హిందుస్థానీ సంగీత కచేరీలకూ, నామసంకీర్తనం కళాకారులకూ వేదిక అయిన 'నాదనీరాజనం' ఇప్పుడు వెలవెల పోతోంది. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఆంధ్రనాట్యం, మోహినియాట్టం, మణిపురి, ఒడిస్సి శాస్త్రీయ నత్యాలను ఈ వేదిక మీద నుంచి వీక్షించిన ప్రేక్షకులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వయోలిన్, మృదంగం, ఘటం, డోలు, వేణువు, కంజీర, మోర్సింగ్, నాదస్వరం, వీణ, శాస్సోఫోన్, తవిల్, సితార్, సరోద్ వంటి వాయిద్య విన్యాసాలను తన్మయులై వీక్షించిన వారు.. ప్రస్తుత ప్రదర్శనల తీరు చూసి పెదవి విరుస్తున్నారు.

క్రైం కార్నర్

విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తన

- ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అరెస్ట్



ఉమా మహేష్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ప్రొఫెసర్ ఉమామహేష్ శుక్రవారం అరెస్టయ్యారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. వ్యవసాయ కళాశాలలో క్రాప్ ఫిజియోలజీ విభాగంలో ఉమామహేష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన ఓ విద్యార్థిని ఫీజులు సక్రమంగా చెల్లించి తరగతులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఒక్కరే క్లాస్‌కు రావడంతో నవంబరు నెలలో పాఠం చెబుతూ.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బయటకు చెప్పేందుకు మధనపడిన ఆమె.. చివరకు ఇప్పుడు తన తల్లి దండ్రులకు చెప్పారు. వారు శుక్రవారం తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

వైసీపీ నేత బుల్లెట్ జయశ్యామ్ అరెస్టు

- చీటింగ్ కేసులో 14రోజులు రిమాండ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్ కేసులో ఆయనకు 14రోజుల రిమాండ్ విధించారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద కొందరు వైసీపీ నాయకులు పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనస కాలువ భూమిని గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేశారు. ఆ స్థలాలను వాటాలుగా వేసుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో బుల్లెట్ జయశ్యామ్ తొట్టంబేడు మండలం శివనాథపురం రెవెన్యూ పరిధిలోని పనసకాల్వ భూమిని ఆక్రమించినట్లు బాహాటంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ యేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పనసకాలువ భూమిలో అక్రమంగా నిర్మించిన 105 కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇందులో కేవీబీపురం మండలం రాజులకండ్రిగకు చెందిన కేశవులు అనే వ్యక్తి బుల్లెట్ జయశ్యామ్‌కు రూ.6లక్షలు నగదు చెల్లించి స్థలం కొనుగోలు చేశాడు. ఆరు నెలల క్రితం అది కాలువ భూమిగా తేలడంతో అధికారులు అక్కడ కట్టడాలను కూల్చివేశారు. దాంతో బాధితుడు కేశవులు తన నగదు రూ.6లక్షలు తిరిగి ఇవ్వాలని జయశ్యామ్‌పై ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం బాధితుడు కేశవులు తనకు కాలువ స్థలాన్ని అమ్మి బుల్లెట్ జయశ్యామ్ అనే వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని గట్టిగా నిలదీస్తే రూ.లక్ష నగదు ఇచ్చాడని... ఆ తరువాత నెలలు గడుస్తున్నా మిగతా నగదుపై సమాధానం చెప్పడం లేదని తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై చీటింగ్‌కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఈ కేసులో తొట్టంబేడు పోలీసులు బుల్లెట్ జయశ్యామ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచడంతో 14రోజుల రిమాండ్ విధించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బుల్లెట్ జయశ్యామ్ తీరుపై పెద్దఎత్తున అభియోగాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఆయన బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడటం దుమారం రేపింది. రెండేళ్ల క్రితం పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ కూడలిలో పాలసరఫరా సంఘం ఎన్నికల నామినేషన్ రోజున టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు కారుపై కాసిరాళ్లతో దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ప్రజలందరూ చూస్తుండగానే చలపతినాయుడును కారు నుంచి బయటకులాగి విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఇక పాలకమండలి సభ్యుడుగా ముక్కంటి ఆలయంలో పలువురు అధికారులపై బూతులతో రెచ్చిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చింతా మోహన్

మన్మోహన్ గొప్ప ఆర్థికవేత్త

తిరుపతి(వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన దేశాన్ని సంపన్నంగా మార్చిన మహానుభావుల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఒకరని, ఆయన గొప్ప ఆర్థికవేత్త అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవారం కాంగ్రెస్ నేతలతో కలిసి మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. చింతా మాట్లాడుతూ మన్మోహన్ సున్నితంగా కనిపించినా దేశ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల్లో ఆయనకు ఎవరూ సాటిలేరన్నారు. ఎంతటి హోదాలో ఉన్న అందరితో హుందాగా ఉంటారని తెలిపారు. అంతటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధగా ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్ నేతలతో కలిసి రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, రావణ్, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

ఐదుచోట్ల పక్షుల పండుగ

- ఏర్పాట్లను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వచ్చే నెల 17నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఐదుచోట్ల పక్షుల పండుగ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో కమిటీలను కూడా నియమించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, నేలపట్టు, బీవీపాలెం, శ్రీసిటీలో పక్షుల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు పక్షుల పండుగ జరిగే జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షుల పండుగకు వచ్చే సందర్శలకు అవసరమైన వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. డీఎల్‌డీవో వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ భవాని, ఏపీఎం ప్రసన్న కుమారి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్రక్కును ఢీకొన్న లారీ


- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- గొర్రెల సంతకు వెళుతుండగా ప్రమాదం
- క్షతగాత్రులందరూ రైల్వేకోడూరువాసులే



మృతి చెందిన సోమయ్య - దెబ్బతిన్న మినీట్రక్కు

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల సంతకు వెళ్తున్న మినీ ట్రక్కును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గూడూరు మండలం చెన్నూరు సమీపంలో శుక్రవారం వేకువజామున 3గంటలకు జరిగింది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు... అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరువాసులు చిల్లకూరు మండలం ముత్యాలపాడు సమీపంలోని గొర్రెల సంతకు మినీట్రక్కులో శుక్రవారం రాత్రి బయలుదేరారు.వేకువజామున 3గంటల సమయంలో గూడూరు మండలం చెన్నూరు సమీపంలో గూడూరు వైపు నుంచి తిప్పవరప్పాడు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మినీట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న అన్నమయ్య జిల్లా పిట్లావారిపల్లెకు చెందిన సోమయ్య(45) మృతిచెందాడు. నాగవరం గ్రామానికి చెందిన మణి, సుబ్రహ్మణ్యం, ఓబులపల్లెకు చెందిన చిన్నవెంకటయ్య, పాతబజారుకు చెందిన రమణయ్య, తిన్నిశెట్టిపల్లెకు చెందిన పెంచలయ్య, చిన్నరాసపల్లెకు చెందిన ఈశ్వరయ్య, పైనపల్లి గ్రామానికి చెందిన భాస్కర్, రైల్వే కోడూరుకు చెందిన సూర్యప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. సోమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. లారీ వేగంగా ఢీకొనడంతో మినీట్రక్కు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కొంతమంది క్షతగాత్రులు వాహనంలో ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో గాయపడిన వారిని వెలుపలికి తీశారు.

శ్రీవారిసేవలో తమిళనాడు గవర్నర్ రవి



ఆలయం ముందు గవర్నర్ రవి

తిరుమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేక సేవలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, టీడీపీ నేత, సినీనిర్మాత అంబికా కృష్ణ, ఎమ్మెల్సీ రఘురాజు, తెలంగాణ ఇంటెలిజెన్స్ అదనపు డీజీ శివధర్ రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రాంతాల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి-అకోలా మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు(07605-07606), తిరుపతి-సికింద్రాబాదు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు(07481-07482) నిర్ణీత సమయంలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం, కారు స్వాధీనం



అంతర్రాష్ట్ర ముఠా అరెస్టును చూపుతున్న పోలీసులు

సత్యవేడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ఉదయం స్థానిక పాలిశీతలీకరణ కేంద్రం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఊత్తుకోట నుంచి వస్తున్న కారు పోలీసులను చూసి దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమై కారును చుట్టుముట్టామన్నారు. కారులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కారును తనిఖీ చేయగా 80 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని విచారించగా మండలంతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతన్నట్లు తేలిందన్నారు. ఈ ముఠా సత్యవేడు మండలం శిరుణంబూదూరులో ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ రాత్రి ఓ ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు చోరీ చేసిందన్నారు. అదే విధంగా దాసుకుప్పంలో ఈ ఏడాది మార్చి 20వ తేదీ మధ్యాహ్నం ఓ ఇంట్లో 40 గ్రాముల బంగారం చోరీ చేసినట్టు విచారణలో అంగీకరించారని తెలిపారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రం ఈరోడ్, రాణిపేట జిల్లాల్లో కూడా ఇటీవల తాజాగా చోరీలకు పాల్పడి కారుతో పాటు బంగారు నగలను అపహరించినట్లు తేలిందన్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా సావుకుప్పానికి చెందిన వి.కన్నదాసన్(28), తిరువణ్ణామలై జిల్లా వెంగిక్కల్‌కు చెందిన జీ.శ్రీరామ్ అలియాస్ బిల్లు (19), రంజిత్‌కుమార్ (19), కాంచీపురం జిల్లా మధురమంగళానికి చెందిన డి.రవి(27), విల్లుపురం జిల్లా సెంజివట్టానికి చెందిన బాలుడు ఉన్నారు. వీరు తమిళనాడులో వివిధ కేసుల్లో జైలుశిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలిసింది.

30 నుంచి అధ్యయనోత్సవాలు

25 రోజులపాటు పాశురాల పారాయణం

తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 23 వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. ఈసందర్భంగా స్వామి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేస్తారు. తొలి 11 రోజులను పగల్‌పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది, 24వ రోజున వరాహస్వామి శాత్తుమొర జరుగుతాయి.

పుత్తూరు వార్తలు

అద్దె బకాయిలు వసూలు చేయరా?

- కౌన్సిల్ సమావేశంలో పట్టుబట్టిన టీడీపీ కౌన్సిలర్లు
- పుత్తూరు చెరువులో మురుగు చేరికను నియంత్రించాలి
- 2025-26 బడ్జెట్‌కు, అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ హరిని ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ జీవరత్నం నాయుడు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. శుక్రవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో బకాయిల వసూలు అంశాన్ని అజెండాలో పొందపరచకపోవడం పట్ల కౌన్సిలర్ జీవరత్నం నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, డీపీఎం షాపులు, మటన్ షాపుల అద్దెలు, జంతు వధశాల, ప్రైవేటు బస్టాండ్, దినసరి మార్కెట్ లీజు చెల్లింపు బకాయిలు రూ.83 లక్షలు వరకు ఉన్నాయని, ఎప్పుడు వసూలు చేస్తారంటూ ప్రశ్నించారు. అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామంటూ చైర్మన్ హరి దాట వేశారు. పుత్తూరు చెరువులో మురుగు కలవకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కాలువ కబ్జాలను నియంత్రించాలని కోరారు. వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకా, కుటుంబ నియంత్రణకు గత కౌన్సిల్‌లో రూ.10 లక్షలు ఆమోదించినప్పటికీ నేటికీ చర్యలు చేపట్టకపోవడంపై మండిపడ్డారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో తమను కౌన్సిలర్లుగా గుర్తించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు వాపోయారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చొరవ తీసుకునేలా చూడాలన్నారు. షేర్ ఆటోల నుంచి గేట్ వసూలు మినహాయింపు ఇవ్వాలని యూనియన్ కౌన్సిల్‌లో కోరారు. అనంతరం 2025-26 బడ్జెట్‌తో పాటు గత కౌన్సిల్‌లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఆ పనులకు చేపట్టిన టెండర్లను ఆమోదించారు. 2025-26 ఏడాదికి ఆదాయంగా రూ.51.68 కోట్లు చూపారు. ఖర్చు 44.96 కోట్లుగా పొందుపరిచారు. రోడ్లు, పార్కులు, వీధి లైట్ల నిర్వహణ, విస్తరణ, బావులు, బోర్లు పనులు, డ్రైయిన్లు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులకు రూ.1.56 కోట్ల అంచనాలను ఆమోదించారు. 2024-25 ఆదాయం రూ.53.61 కోట్లు రాగా, రూ.47.99 కోట్లు ఖర్చు చేసినట్లు చూపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, ఇతర కౌన్సిలర్లు, కమిషనర్ మంజునాథ్ గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించండి: మాజీ మంత్రి రోజా



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో వైసీపీ నాయకులతో కలిసి బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి నేడు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను ఆరునెలలైనా అమలు చేయకుండా తెచ్చిన కోట్ల రూపాయల రుణాలను ఏమి చేశారన్నారు. ప్రభుత్వాన్ని నడపకుండా ప్రతిదాన్ని మాజీ సీఎం జగన్ మీద తోసేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆరేటమ్మ కాలనీ నుంచి బజారు వీధి మీదుగా విద్యుత్ డీఈఈ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ జరిగింది. పుత్తూరు, నగరి మున్సిపల్ చైర్మన్లు హరి, నీలమేఘం, ఎంపీపీలు మునివేలు, దీప, నాయకులు మాహీన్, జయప్రకాష్, శంకర్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్డీఎం గేటుకు మరమ్మతులు చేపట్టండి: సీపీఎం



స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఎం రైల్వే గేటుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ పుత్తూరు రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. నాలుగు రోజుల క్రితం గేటు మరమ్మతులకు గురైందని, నారాయణవనం పిచ్చాటూరు, నాగలాపురం, ఊత్తుకోట, సత్యవేడుకు వెళ్లాల్సిన ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. సీపీఎం నాయకులు విజయ్, సుబ్రమణ్యం, యాసిన్‌బాషా, సతీష్‌కుమార్, రమేష్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు గేటు వసూలు రద్దు చేయండి

సీఐటీయూ

పుత్తూరు టౌన్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆటోలకు గేటు వసూలును రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లకు శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని, ఈ సమయంలో గేటు వసూలుతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విజయ్, యాసిన్, శివ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను మినహాయింపునకు తప్పుడు క్లెయిమ్‌లు వద్దు



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న వంశీధర్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తప్పుడు క్లెయిమ్‌లతో ఆదాయ పన్ను మినహాయింపులు పొందితే భవిష్యత్తులో చిక్కులు తప్పవని తిరుపతి ఐటీ సర్కిల్ జాయింట్ కమిషనర్ టి.వి.వంశీధర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కె.పి.రెసిడెన్సీలో పన్ను చెల్లింపుదారులు, కన్సల్టెంట్లకు అడ్వాన్స్ టాక్స్ పేమెంట్, కాన్‌సీక్వెన్సెస్ ఆఫ్ టాక్స్ రీఫండ్, క్యాష్ విత్ డ్రా అండ్ డిపాజిట్, డైరెక్ట్ టాక్స్, వివాద్ సేవా విశ్వాస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిరునామా, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడిలను పన్ను చెల్లింపుదారులు ఇన్‌కంటాక్స్‌ఇండియా, ఈ ఫైలింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఐటీ చెల్లింపులలో అవకతవకలు ఉన్నట్లు గుర్తిస్తే పది సంవత్సరాల తరువాత కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని వంశీధర్ హెచ్చరించారు. ఐటి శాఖ నోటీసులకు వెంటనే స్పందించకపోతే భారీ జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ రామకృష తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

వాకాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం డీఎస్పీ రమణకుమార్ తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని క్రైమ్ రేట్, పురోగతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

ఏరియా ఆస్పత్రికి నాలుగు నెలల్లో నూతన భవనం

కలెక్టర్ వెంకటేశ్వర్



ఏరియా ఆస్పత్రి వద్ద నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, వైద్యులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏరియా ఆస్పత్రి వద్ద నిర్మిస్తున్న నూతన భవనాన్ని నాలుగు నెలల్లోగా ప్రజలకు అందుబాటు లోకి తెచ్చేలా చర్యలు చేపడుతామని కలెక్టర్ వెంక టేశ్వర్ అన్నారు. శుక్రవారం ఆయన ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారా లేదా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తన దృష్టికి తీసుకురావడంతో తనిఖీ చేపట్టామన్నారు. రూ.23 కోట్లతో చేపట్టిన ఏరియా ఆస్పత్రి నూతన భవనాలు నాలుగేళ్లుగా సాగుతుండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించి నాలుగు నెలల్లో నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారి ప్రమాదాల్లో గాయపడి ఏరియా ఆస్పత్రికి వచ్చేవారికి సత్వర సేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. మార్చురి గది సమీపంలో ప్రహరీ దెబ్బతిందని, ఆస్పత్రిలోని వ్యర్థపునీరు స్టేడియంలోకి వస్తుండడంతో వాకర్లు, క్రీడాకారులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రహరీ నిర్మిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చునని, ఇందుకు నిధులు కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రహరీ నిర్మించేందుకు రూ.17లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పడంతో కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆసుపత్రి సూపర్నిండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రవికుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్‌ఐ ధ్యేయం



ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్‌ఐ ధ్యేయమని, ఇందుకోసం అలుపెరుగని పోరాటాలు సాగిస్తామని ఆ సంఘం నెల్లూరు జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల వసతి గృహాల్లో మౌలిక సదుపాలయాలను మెరుగుపరచాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా యశ్వంత్, బ్రహ్మేంద్ర, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సుజిత్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మణి, మధు, కిరణ్, రాహుల్, రఫీ, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని నెలబల్లిలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో గొడవర్తి ప్రవీణ, ఎంఈవో మించల శంకరయ్య, ఆర్‌ఐ సంతోషీబాయి, వీఆర్వోలు భూదనం రమేష్, మోబీనా, కల్యాణి, మండల సర్వేయర్ పూజిత, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు మురళీనాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, కురుమేటి ఉదయ్‌కుమార్, నరేంద్ర, పసుపులేటి రవినాయుడు, కోదండరామ నాయుడు, అట్ల బాబు, మాధవరెడ్డి, చంద్రయ్య, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

'నాగరాజు, హర్షను ఆదుకుంటాం'



చిన్నారులకు నగదు అందజేస్తున్న ఎంపీడీవో వేణు, అధికారులు

కోట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వింత చర్మవ్యాధితో బాధపడుతున్న కోట మండలం కర్లపూడి బీసీ కాలనీకి చెందిన అన్నదమ్ములు నాగరాజు, హర్షలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీడీవో వేణు తెలిపారు. ఈనెల 25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నరక యాతన' వార్తకు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన సూచన మేరకు కర్లపూడిలో నివాసం ఉంటున్న చిన్నారులను శుక్రవారం ఎంపీడీవో వేణు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, అల్లాభక్షు, సచివాలయ సిబ్బంది పరామర్శించారు. వ్యాధి రావడానికి గల కారణాలను తండ్రి వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. మందుల ఖర్చులకు కొంత నగదు అందజేశారు.

అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం: కలెక్టర్

నాయుడుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం చూపించాలని కలెక్టర్ వెంక టేశ్వర్ అధికారులను ఆదేశించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని విన్నమాలలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి విన్నమాల మీదుగా అత్తలపాళెం వరకు 3.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని ప్రజలు వినతిపత్రం అందజేశారని, ఈరోడ్డు నిర్మాణానికి మూడు రోజుల్లో అనుమ తులను మంజూరు చేస్తామని చెప్పారు. అలాగే విన్నమాలలో శ్మశానవాటిక కోసం 50 సెంట్లు కేటాయించి, పనులను కూడా త్వరలోనే చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయుడుపేట పట్టణం నుంచి జాతీయ రహదారి దాటి విన్నమాల, మరో నాలుగు గ్రామాలకు వెళ్లాల్సి ఉందని, ప్రమాదాలు ఎక్కువ జరుగుతుండడంతో అండర్‌బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరారు. అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి వీలులేకపోవడంతో వేరే తరహాలో బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను మరోచోట నిర్మించండి

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాంబట్టులో ఏర్పాటు కానున్న నూతన సబ్‌స్టేషన్ మరోచోట నిర్మించాలని ఎన్‌ఎంకండ్రిగ గ్రామస్తులు తహసీల్దారు శరత్‌బాబును కోరారు. శుక్రవారం వారు తహసీల్దారు కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. ప్రస్తుతం సేకరించిన భూమి అడవి పోరంబోకు అని, గ్రామ అవసరాల కోసం దానిని వదిలిపెట్టి, మరోచోట సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తహసీల్దారు చెప్పారు.

అంగన్‌వాడీ విద్యపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్న కార్పొరేట్ స్థాయి విద్యపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లతో కోట సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని రెండోపట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పాతసంత రోడ్డు జంక్షన్‌లో హెల్మెట్ ధారణపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్‌ను ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడుతామన్నారు. నిబంధనలు ఉల్లఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాహన దారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్, సుబ్బరామరాజు తదితరులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య సుబ్బరామరాజు, వేమయ్య, సుబ్బారావు తదిరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఒక గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల కారణంగానే దేశ ఆర్థికవ్యవస్థ ప్రగతిపథంలో పయనించిందన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయకుమార్

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ తేదీలు ఖరారైనందున గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పక్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చెత్తాచెదారాలు లేకుండా చూసుకోవాలని, మురికిగుంటలు ఉన్నచోట బ్లీచింగ్ చల్లాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, శేషారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

వాకాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం గ్రామానికి చెందిన మల్లాపు దేవేంద్రబాబు శుక్రవారం గూడూరు మండలం మనుబోలు వద్ద ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదనరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, తీపలపూడి అన్వేష్ ద్వారా రూ. 10వేల నగదు అందజేశారు.

కరెంటు చార్జీల పెంపు పాపం జగన్‌దే: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సీసీ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, రావి మస్తాన్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు

వెంకటగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పలుమార్లు కరెంటు చార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపిన పాపం మాజీ సీఎం జగన్‌దేనని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, రావి మస్తాన్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, కురుగొండ్ల దొరస్వామి మీడియాతో మట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు పూర్తి కాకముందే కరెంటు చార్జీలు విపరీతంగా పెంచేసిందని వైసీపీ నేతలు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పోరుబాట పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేతలు అవాకు చవాకులు పేలడం తగదన్నారు. అదానీతో జగన్ కుదుర్చుకొన్న చీకటి ఒప్పందాల కారణంగానే రాష్ట్రం దివాలా తీసిందన్నారు. ఇప్పుడు ఏ మోహం పెట్టుకొని జనంలోకి వస్తారని ప్రశ్నించారు. జగన్‌కు ధైర్యం ఉంటే అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని హితవు పలికారు.

విద్యుత్‌చార్జీల పెంపుతో పేదలపై పెనుభారం: వైసీపీ





గూడూరు సబ్‌స్టేషన్ ఎదుట ఎమ్మెల్సీ మేరిగ ఆధ్వర్యంలో ధర్నా - వెంకటగిరిలో రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణుల ర్యాలీ



నాయుడుపేటలో విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై పెనుభారం మోపిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భక్తవత్సవలరెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, సునీల్‌రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, కాంద్ర నారాయణరెడ్డి, గురవయ్య, బాలకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. మాజీ ఎమ్మెల్యే స్వగృహం నుంచి స్కూటర్ ర్యాలీగా విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కొంతమందిని మాత్రమే కార్యాలయం లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. దీంతో సంజీవయ్య, పోలీసులు మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ సంగతి తేలిస్తానంటూ మాజీ ఎమ్మెల్యే హెచ్చరికలు జారీచేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈకి వినతిపత్రం అందజేసి వెనుతిరిగారు. వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ కటకం దీపిక, ఎంపీపీలు ధనలక్ష్మి, పెళ్లకూరు జడ్పీటీసీ ప్రిస్కిల్లా, అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నేదురుమల్లి నివాసం నుంచి ర్యాలీగా వెళ్లి పాలకేంద్రం వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, బాలయ్య, కల్యాణి, రాజారెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి, ఆరి శంకరయ్య, శ్రీనివాసులు, సుజాత, వహిదా, ఎస్‌ధానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈశాన్యంలో బరువంట!

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు ● వాస్తుదోషమంటూ ఏళ్లుగా వాడని వైనం

రేణిగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాస్తు దోషమంటూ ఏడేళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంకును కూల్చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో తూర్పు దిక్కున పట్టణవాసుల తాగునీటి అవసరాలను తీర్చడానికి 1993లో 40వేల లీటర్ల సామర్థ్యంతో తాగునీటి ట్యాంకును నిర్మించారు. గతంలో ఈ ట్యాంకును నింపి పాంచాలి నగర్‌వాసులకు సరఫరా చేసేవారు. అయితే అక్కడ ట్యాంకు ఉండడంతో పంచాయతీ కార్యాలయ సిబ్బందికి మంచి జరగడం లేదని నమ్ముతూ వచ్చారు. ఇక అప్పటి నుంచి ట్యాంకుకు నీరు పట్టకుండా వదిలేశారు. వాస్తవానికి అప్పట్లోనే కూల్చేయాలని అధికారులు భావించారని, ట్యాంకుకు కాలవ్యవధి ఉండడంతో వదిలేసినట్టు సమాచారం. ఇప్పుడు ఈశాన్యంలో బరువంటూ వాస్తు దోషం సాకు చూపిస్తూ ట్యాంకును తొలగించే ప్రయత్నం జరుగుతున్నట్టు ప్రచారం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మణిని వివరణ కోరగా... తాను ఇటీవల బదిలీపై వచ్చానన్నారు. ట్యాంకును నిపుణుల ఆధ్వర్యంలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

కరెంటు చార్జీల పెంపు తగదు

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచడం తగదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం వైసీపీ నాయకులతో కలిసి ఛార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఆరు నెలల్లోనే ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అంజూరు శ్రీనివాసులు, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అదిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధు

ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీ జరిగిందని మూడు రోజులుగా పోలీసులను ప్రాధేయపడుతున్నా కనీసం కేసు నమోదు చేయడంలేదని ఓ యువతి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని దక్షిణ కైలాస్ నగర్‌కాలనీకి చెందిన దివ్య చౌదరి ఆరు రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసింది. నాలుగు రోజుల క్రితం అది చోరీకి గురైంది. తమ ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో దృశ్యాలను కుటుంబసభ్యులు సేకరించి శ్రీకాళహస్తి రెండో పట్టణపోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే చోరీ జరిగిన సమయాన్ని బట్టి కొత్త బైపాస్ రోడ్డులో పలుచోట్ల బాధిత కుటుంబ సభ్యులు సీసీ కెమెరాలను పరిశీలించారు. చెన్నై రోడ్డులోని ఎంజీఎం పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో దివ్య చౌదరి ద్విచక్రవాహనంతో పాటు ఐదుగురు ముఠాగా ఏర్పడి మొత్తం ద్విచక్ర వాహనాలను తీసుకెళుతున్నట్లుగా రికార్డైంది. ఈ సమాచారం కూడా పోలీసులకు అందించారు. అయితే మూడు రోజులపాటు పోలీసుస్టేషన్ చుట్టూ ఫిర్యాదు చేతబట్టివారు ప్రదక్షిణలు చేస్తున్నా కనీసం కేసు నమోదు చేయలేదని బాధిత యువతి ఆవేదన వ్యక్తం చేస్తోంది. పక్కా సీసీకెమెరాల ఆధారాలు సమర్పించినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నిస్సాహయతను వ్యక్తం చేస్తోంది.

ధ్యానంతో మానసిక ఒత్తిడిపై విజయం

నారాయణవనం, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ఒత్తిడి జయించవచ్చని తిరుపతి స్విమ్స్ వైద్య కళాశాల ప్రొఫెసర్ వనజాక్షమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వనజాక్షమ్మ మాట్లాడుతూ... చాలమంది మానసిక ఒత్తిడికి గురై గుండె సంబంధింత వ్యాధులతో మరణిస్తున్నారని తెలిపారు. మానిసక ఒత్తిడిని ధ్యానంతో జయించవచ్చన్నారు. అనంతరం తిరుపతి హార్ట్ ఫుల్‌నెస్ సంస్థకు చెందిన కులశేఖరన్, పుష్పలత, సంధ్యారాణి, హరిబాబు విద్యార్థులతో ధ్యానం చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేయడం వలన విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దన్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న వనజాక్షమ్మ

అంగన్‌వాడీ కేంద్రాలు విజ్ఞాన నిలయాలు

సత్యవేడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు విజ్ఞాన నిలయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు విద్యా బోధనపై కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు పిల్లలకు మొదటి గురువులన్నారు. బోధనలో మెలకువలు తెలుసుకుని, వాటిని పిల్లలకు అందించాలన్నారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, ఈవోపీఆర్‌డీ తరుణాక్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు




శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, నాగాలాండ్ ప్రభుత్వ కార్యదర్శి తవసీలన్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



ఏర్పేడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండీపుత్తూరు ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గేట్లు పగులగొట్టి ఆలయంలో ఉన్న హుండీలో ఉన్న కానుకలను అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి పూజ చేయడానికి వచ్చిన గ్రామస్తులు గుర్తించి సర్పంచ్ మోహనప్రియకు చెప్పారు. ఆమె ఏర్పేడు సీఐ జయచంద్రకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయండి

● వైద్య మంత్రికి సర్పంచు వినతి

ఏర్పేడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపాళెంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచు జయరామయ్య కోరారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. మోదుగుల పాళెం పంచాయతీ స్వర్ణముఖి నది అవతల ఉందని యేటా వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహించి సుమారు 15రోజుల పాటు తమ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమయంలో పేదలకు వైద్యం అందక అవస్థలు పడుతున్నారన్నారు.



సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పిచ్చాటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి మాట్లాడుతూ... రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ తేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చైతన్యప్రియ, నాయకులు డిల్లీ, శ్రీనివాసులు, మణికంఠం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణన జాబితా ప్రదర్శన

వరదయ్యపాళెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా జాబితాను ప్రతి సచివాలయం వద్ద నోటీసు బోర్డులో ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సబంధిత వీఆర్వోలకు తెలియజేయాలన్నారు.

పొంగిన చెరువులు... కుంగిన రోడ్లు


కలుజు పారుతున్న ఎస్ఎల్‌పురం చెరువు - రాజులుకండ్రిగ వద్ద కుంగిన శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రహదారి - కొట్టుకుపోయిన కొట్టాలమిట్ట ప్రధాన రోడ్డు

కేవీబీపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుస తుఫాన్లకు ప్రధాన రహదారులు కుంగిపోయాయి. శ్రీకాళహస్తి - పిచ్చాటూరు ప్రధాన రహదారి రాజులకండ్రిగ వద్ద కుంగిన రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడు తు న్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు. కొట్టాలమిట్ట కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో నెర్రెలిచ్చి నీరు పారుతోంది. ఇక మండలంలో 126 చిన్న, పెద్ద చెరువులన్నీ కలుజు పారుతున్నాయి. గత ప్రభు త్వ హయాంలో చెరువు కట్టలను పట్టించుకోక పోవడంతో కొన్ని ప్రమాదకరంగా ఉన్నాయి. కళ త్తూరు, అంజూరు, మఠం, ఎస్ఎల్‌పురం, ఆద వరం, రాయలచెరువులు కలుజులు పారుతుండగా వర్షాలు కొనసాగితే గట్లు తెగే ప్రమాదముంది. ఆరె, కళత్తూరు చెరువు గట్లు బలహీనంగా ఉండటంతో ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మిగతా చెరువుల గట్లు కూడా పటిష్ఠ పరచాల్సి ఉంది. ఆయా శాఖల అధికారులు స్పందించి చెరువు గట్లను పటిష్ఠపరచడంతోపాటు రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది జగనే

మండిపడ్డ టీడీపీ బీసీ సెల్

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డే అని టీడీపీ బీసీ సెల్ నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అరాచక పాలనలో విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందంటూ ధర్నాకు పిలుపునివ్వడం జగన్ మానసిక పరిస్థితిపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. తన చేతకాని తనంలో విద్యుత్‌రంగాన్ని నాశనం చేసి విద్యుత్ సంస్థలకు రూ.50వేల కోట్లు అప్పుల ఊబిలోకి దించారన్నారు. అంతే కాకుండా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నుంచి రూ.32వేలు కోట్లు దోచుకున్నారని తెలిపారు. దీంతో ప్రజలకు కరెంటు బిల్లులు తప్ప ఇంకేమి మిగల్లేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్తం చేసిన మాజీ సీఎం అతని బృందం విద్యుత్ సమస్యలపై మొసలికన్నీరు కారుస్తూ ధర్నా నాటకాలు చేస్తున్నారన్నారు. ప్రజలు మరోసారి వైసీపీకి గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నేర నియంత్రణే ప్రథమ కర్తవ్యం: ఎస్పీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణే ప్రథమ కర్తవ్యంగా అంకితభావంతో పని చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. మొదట పోలీస్‌స్టేషన్‌లో మోడల్ కంప్యూటర్ గదిని ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. గంజాయి, జూదం, అక్రమమద్యం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థ కోసం ప్రత్యేక చర్యలపై చర్చించారు. ఇక ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగడంతో పాటు కాల్ సెంటర్ల ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ రిసెప్షన్, పరిసరాలు, పక్కనే ఉన్న పోలీస్ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టి పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. శుక్రవారం ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి పూట గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, సీఐలు సుబ్రహ్మణ్యం, జయచంద్ర, ఏఎస్ఐలు జగన్‌మోహన్, అబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి పోలీస్ క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రతి హాస్టల్‌లో సకల సదుపాయాలు: ఆదిమూలం


అధికారులతో మాట్లాడుతున్న ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ వసతి గృహంలో సకల వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికలు, బాలుర వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో శుక్రవారం వాటిని సాంఘిక సంక్షేమ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఎన్‌కండ్రిగ లోని రెండు వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.32లక్షలు మంజూరైనట్టు తెలిపారు. టీడీపీ నాయకులు మునిచంద్రనాయుడు, దయనాయుడు, మధునాయుడు, వెంకటాచలం, రవినాయుడు, భూపయ్య, వెంకటేశ్వర్లు, కార్తిక్ నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య సహాయ సంచాలకుడు ఆనంద్, ఎంఈవో మునిసుబ్రమణ్యం, వార్డెన్లు సుభాషిణి, సాల్మన్ రాజ్, ఎస్ఐ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: పట్టణంలోని ఎస్సీ వసతి గృహాలను ఎమ్మెల్యే ఆదిమూలం పరి శీలించారు. వర దయ్యపాళేనికి తొలి బాలికల వసతి గృహం మంజూరు కావడం గర్వ కారణంగా ఉందన్నారు. గోవర్ధనపురం సమీపంలోని మార్లమ డుగుపై వంతెన ఆధునికీకరణ, గండి పడిన సంతవేలూరులోని పులిబొంద, మార్లమడుగు కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. వరదయ్యపాళెంలో 500మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు భూసేకరణ పూర్తయిందని వెంటనే స్థలం లేని పేదలకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దారు రాజశేఖర్‌ను కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు జ యచంద్ర నాయుడు, చలపతి నా యుడు, నరసరాజు, దశ రథన్, కరుణాకర్ నాయుడు, బాబురెడ్డి, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, మునిభూషణమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య, విద్యాశాఖ ఈఈ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఆది మూలం పరి శీ లించారు. వసతి గృహాన్ని రూ. 9 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, హాస్టల్ వార్డెన్ గంగాధరం, నాయకులు పరమశివం, చిన్నా, షణ్ముగం, ప్రభాకర్ రెడ్డి, బాబు, అరుళ్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ భూముల సమస్యను పరిష్కరించండి

కేవీబీపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 164 అర్జీలు వచ్చాయని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. బ్లాక్ నెం.4లో రెవెన్యూ, అటవీశాఖల మధ్య నలిగిపోతున్న కళత్తూరు, పాతపాళెం ఎస్సీల భూ సమస్యను పరిష్కరించాలని వినతి చేశారు. తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, నాయకులు రామాంజులు నాయుడు, వెంకటకృష్ణయ్య, మణి, గోవర్ధన్, వెంకటరెడ్డి, కృష్ణయ్య తహసీల్దారు మునిరత్నంరెడ్డి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో గ్రామ కంఠం భూములను ఆన్‌లైన్‌లో పొంరబోకు భూములుగా మార్చేశారని శుక్రవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌ఐ నల్లయ్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వేయరు రాజ్‌కుమార్, సర్పంచులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయ క్యాలెండర్ ఆవిష్కరణ



నాగలాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాయ నూతన క్యాలెండర్లను శుక్రవార ఎమ్మెల్యే ఆదిమూలం ఆవిష్కరించారు. నాగలాపురం ఏఎంసీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే పల్లికొండేశ్వరాయంలో ఈనెల 28న శనివారం శనిత్రయోదశి పూజలకు ఎమ్మెల్యేను ఆలయ ఈవో లత ఆహ్వానించారు. టీడీపీ నాయకులు శ్రీనివాసయాదవ్, మురళి, పరశురాం శిల్పి, పార్తిబన్, సుబ్రహ్మణ్యం రాజు, తెన్నరసు, యమున తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి భక్తులకు హ్యాండ్‌బ్యాగ్, నగదు అప్పగింత



శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు హ్యాండ్‌బ్యాగ్‌ను మరచిపోగా ఆలయ సిబ్బంది వారికి దాన్ని అందించారు. హైదరాబాద్‌కు చెందిన సూర్యప్రకాష్ కుటుంబం ముక్కంటి సేవలో పాల్గొంది. దర్శనానంతరం ఆలయ ఆవరణలోని ఊంజల్‌సేవ మండపం వద్ద హ్యాండ్‌బ్యాగ్‌ను మరచిపోయారు. దాన్ని ఆలయ అధికారులు గుర్తించారు. దాన్ని తెరచి చూడగా రూ.99,260 నగదు, ఫోన్లు ఉన్నాయి. అందులోని విజిటింగ్ కార్డు ఆధారంగా అనౌన్స్‌మెంట్ చేయగా భక్తులు అక్కడికి చేరుకున్నారు. వారు చెప్పిన ఆధారాలు సరిపోవడంతో అప్పగించారు.

జాబ్‌మేళాలో 23మంది ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీ, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 40మంది హాజరు కాగా 23మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మునిలక్ష్మి, ప్రిన్సిపాల్ పట్టాభి ఎంపికైన వారికి నియామకపత్రాలను అ ందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, నోడల్ ఆఫీసర్ ఖదీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అ లంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధి కారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

జాహ్నవికి అభినందన



శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగాలని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజకుమారి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో పాఠశాలకు చెందిన జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు బహుమతిని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జాహ్నవిని సత్కరించారు. ఉపాధ్యాయులు సురేష్, శాంతి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.